


## చదువుల మార్పు

మావూరు బడి పంతులు వెంకట శాస్త్రి; నేను ఒక రోజు సాయింత్రం రచ్చబండ దగ్గిరికి సరదాగా వెళ్లా. ఆనయకు ఇంతో అంతో "తెలుగు వైద్యం"లో నేర్పరితనంవుంది. ఆవేళ మా స్నేహితుడు "రామం" కూడా మమ్మల్ని కలిసేడు. వాడికి సంగీతం సరస్వతీ ప్రసాదముగా వచ్చిన విద్య.

"రామం"ని చూడగానే "వెంకట శాస్త్రి"గారికి మంచి ఆలోచన తట్టి "రామం" నీ సంగీతశాస్త్రము నాకు నేర్పు నా తెలుగువైద్యం నీకు నేర్పుతాను అంటు రచ్చబండమీద చతికిలబడ్డాడు.

మా రామంగాడు ఒక రాగంతీసి "వెంకటశాస్త్రి"తో ఇది "ఆనంద భైరవి" అంటారు అన్నాడు. అది విని వెంకటశాస్త్రి ఓహెూ అలాగా! ఏది మరొక రాగం తీయి ఆరాగంపేరు నేను చెప్పుతాను అన్నాడు.

"రామం" మరొకరాగం తీసాడు.

అది విని వెంకటశాస్త్రి తన తెలుగు వైద్యంలోని అనుభవమును కూడగట్టుకొని అయితే రామం ఇది "వసంత కుసుమాకరం" అంటారు అని అనేసరికి మే మిద్దరం నవ్వు అపుకోలేక చచ్చాం! పాపం వెంకటశాస్త్రిగారిగతి వేరే చెప్పాలా!

మోహన్.

## అలవాటులో పొరబాటు

కొందరు హైస్కూలు విద్యార్థులు కలసి స్కూలు సహాయానికి ఒక చిన్న డ్రామావేసిరి. ఆ డ్రామాకి స్కూలు మాస్టర్లు, స్కూలు విద్యార్థులు; కొందరు పురజనులు టిక్కెట్లు కొనుక్కొని డ్రామా చూచుటకు వచ్చిరి. డ్రామా సగంవరకు పూర్తికావచ్చినది. ఆ తరువాత తెరలో రాజు వచ్చి మంత్రిని పిలచి, తన పరిపాలనా విషయమై ప్రజలేమనుకొనుచున్నారో ప్రశ్నించుట.

రాజు:—మంత్రీ! మన పరిపాలనా విషయమై ప్రజలు ఏమనుకొనుచున్నారు.

మంత్రి:—మహాప్రభూ! తమ రాజ్య పరిపాలనా విషయములలో ఏరాజులు తమకు సాటిరాజాలరని ప్రజ లనుకొనుచున్నారు. గాని.........

రాజు:—ఏమిటా గాని పూర్తిగా చెప్పవయ్యా.

మంత్రి:—మహాప్రభూ! శత్రువులు వచ్చిమనకోటను ముట్టడించుచున్నారు.

రాజు:— ఆ...అలాగునా? శత్రువులువచ్చి మన కోటను ముట్టడించుచున్నారా? సరే అది తరువాత చూదుముగాని. ఒరే నాకోబీడీ పడేరా చాలాసేపు బట్టి దమ్ము కొట్టలేదు. వెంటనే డ్రామాకువచ్చిన వారందరు గొల్లున నవ్వారు. (వెంటనే మంత్రి వేషమువేసిన కుర్రవాడు రాజువేషము వేసిన తన స్నేహితునితో రహస్యంగా ఒరే ఇది స్కూలుకాదురా, నాటకరంగ స్థలమురా అని చెప్పెను. వెంటనే రాజువేషము వేసిన కుర్రవాడు మంత్రి వేషములోవున్న స్నేహితునితో అరరే! అలవాటుప్రకారగా అనివేసితినిరా ఎంత పొరబాటైనది అనగానే తెరపడెను.

నందివాడ అప్పారావు.

## డబుల్ పన్నా

ఇప్పుడేం సరదా. అప్పుడు మా సరదా. ఇప్పుడు ఎవరికివారే యమునా తీరే. అప్పుడు అంటే మాకాలేజి స్టడీస్ రోజులలో, నెలకోసారి 'పిక్నికో', మూడు నెలలకోసారి ఎక్సకర్షన్లు తిరుగుతూండే వాళ్ళం. మాదో గ్రూపు. పదిమంది మెంబర్సుం మా 'స్థూలగాయంగాడు' కాక.

అలాగే ఒకనాడు విశాఖపట్నం సింధియా నావిగేషన్ కంపెనీ చూడటానికి ప్రోగ్రామ్ వేసుకున్నాము. మేము ఎప్పుడు ఎక్కడకెళ్ళినా రిక్షాలు, జట్కాలు, కూలీలు, టిక్కెట్లుతీయటం మొదలైనవన్నీ మా స్థూలకాయానికి అంటగడతాం. ఆవేళకూడా అలాగే వాడు మా అందరి దగ్గరా టిక్కెట్టు చార్జిలు వసూలుచేసి స్టయిలుగా కౌంటరు దగ్గర పడేసి పది టిక్కెట్లు ఇమ్మన్నాడు. తనుకూడా వస్తున్నానన్న సంగతి మరిచిపోయాడు పాపం. టిక్కెట్లుతెచ్చి 'సేఫ్టీ' కోసం నా దగ్గరుంచేడు.

రైలుఎక్కేం విజయనగరందాటింది. టి. టి. సి. గారు వచ్చేరు. టిక్కెట్లు అడిగేరు. టిక్కెట్లుతీసి చూపించేను. ఒకసారి మా అందరి పక్క చూసి టిక్కెట్లు లెక్కపెట్టేరు. మళ్ళీ లెక్కపెట్టేరు టిక్కెట్లు పది. మనుష్యులం పదకొండుగురం.

"మరోటిక్కటో" అన్నట్టు నావేపు చూసేడు.

ఇదిగ్రహించి మా మూర్తిగాడు "అయ్యా! మేం పదకొండుగురం. కాని ఇదిగో వీడిని (అని స్థూలకాయాన్ని చూపించి) గురించి మాకు సందేహం వచ్చింది. డబల్ పన్నా మనిషికదా! ఒక్కటిక్కెట్టు తీస్తే ఒప్పుకుంటారో ఒప్పుకోరో అని తీయటం మానేసేం. మీరు దయచేసి చెప్తే ఎంతయితే అంత ఇచ్చేస్తాం." అన్నాడు. మాకు నవ్వాగిందికాదు.

"సింగల్ టిక్కట్టు" చాలు అని తన పుస్తకంతీసి డబ్బుపుచ్చుకొని రసీదు వ్రాసియిచ్చి వెళ్ళిపోయేడు. స్థూలకాయంగాడు కూడా కొంచెం సంతోషించేడు.

షోరావ్